క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: కేఎల్‌యూ రోడ్‌లో విద్యుత్ లైన్ల మార్పిడి కారణంగా మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అక్కుల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొలనుకొండ, గుండిమెడ గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఎస్‌ఎన్‌జీ ఫౌండేషన్ వార్షికోత్సవం



మంగళగిరి: నగరంలోని టెంపుల్ హిల్ ఏకో పార్కులో విజయవాడకు చెందిన ఎస్‌ఎన్‌జీ(సేవ్ ద నేచర్ బై గ్రోయింగ్ ట్రీస్) ఫౌండేషన్ 5వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతినిధులు పార్కులోని పచ్చని వాతావరణంలో ఆనందంగా ఆహ్లాదంగా సేదతీరారు. అనంతరం పార్కులో సీతాఫలం, రామాఫలంతో పాటు అనేక రకాల ఔషధ మొక్కలు నాటారు. తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌ఎన్‌జీ నిర్వాహకులకు స్థానిక వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్‌ఎన్‌జీ సంస్థ నిర్వాహకులు కందుల శారదావాణి, వల్లభనేని వాణి, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంచాల రామ్మోహన్‌రావు, వీసం వెంకటేశ్వరావు, పుప్పాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు నృసింహుని పానకం హక్కుల బహిరంగ వేలం

మంగళగిరి: నగరంలోని పానకాల లక్ష్మీనృసింహస్వామి పానకం తయారు చేసి విక్రయించుకునేందుకు ఈ టెండర్ , సీల్డ్ టెండర్, బహిరంగ వేలం ఈ నెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు దిగువ సన్నిధి ముఖమండపంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ అక్టోబర్ 2023 నుంచి 20 అక్టోబర్ 2024 వరకు ఏడాది కాలనికి నిర్వహించే వేలంలో ఆసక్తి కల వారు పాల్గొనవచ్చునని తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఈఓ కార్యాలయంలో టెండరు ఫారాలు తీసుకుని బుధవారం ఉదయం 10 గంటల లోపే టెండర్ ఫారాలను బాక్స్‌లో వేయాలని కోరారు. ఈ టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలంలో ఏది అదనంగా పాట ఉంటే ఆ టెండరుని అనుమతించబడునని తెలిపారు.

పొన్నెకల్లులో టీడీపీ నాయకుల అత్యుత్సాహం

తాడికొండ: తాడికొండ మండలం పొన్నెకల్లులో టీడీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. టీడీపీకి చెందిన వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా గ్రామంలో ఆదివారం రాత్రి ఊరేగింపు నిర్వహిస్తుండగా పొన్నెకల్లు శివాలయం సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు రాగానే రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహంపై పసుపు చల్లి నానా హంగామా చేశారు. పసుపు చల్లడంతోపాటు వైఎస్సార్ విగ్రహంపై చెప్పులు కూడా విసిరినట్లు కొందరు ఆరోపిస్తున్నారు. దీనిపై బాధితులు ఆదివారం రాత్రే ఘటనకు కారకులైన ఆరుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు చేయలేదు.

సుబ్బారాయుడికి వెండి వస్తువులు బహూకరణ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళగిరికి చెందిన గీతికా బాంధవ్య కుటుంబ సభ్యులు రూ. 57 వేలు విలువ చేసే వెండి ప్లేట్, వెండి చెంబు సోమవారం బహూకరించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆమె స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 473 గ్రాముల వెండి ప్లేట్, 266 గ్రాముల వెండి చెంబు ఆలయ అధికారి వెంకటాద్రికి అందజేశారు. ఆలయ మర్యాదలతో దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

యువకుడు అదృశ్యంపై ఫిర్యాదు



మంగళగిరి: నగర పరిధిలోని నవులూరుకు చెందిన యువకుడు అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. నవులూరుకు చెందిన షేక్ గౌస్(28) ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి రాకపోవడంతో షేక్ గౌసియా బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో విచారించినా గౌస్ ఆచూకీ లభించకపోవడంతో సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహాత్మా గాంధీ మార్గం అనుసరణీయం

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- ఘనంగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి



ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ నాయకులు

మంగళగిరి: జాతిపిత మహాత్మ గాంధీ మార్గం అనుసరణీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. మహాత్మ గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ శాస్త్రి విలువలతో కూడిన రాజకీయాలతో రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, పార్టీ పట్టణ, తాడేపల్లి పట్టణ, రూరల్ కన్వీనర్లు ఆకురాతి రాజేష్, బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు సంకె సునీత, మల్లవరపు సుధారాణి, కలకోటి బోయేజు, ఈపూరి ఆదామ్, బేతపూడి నరసయ్య, దొడ్డక కృష్ణ, రజక సంఘం వెంకటేశ్వర్లు, దేవళ్ల సుబ్బారావు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో...

నగరపాలక సంస్థ పాలక కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తాడేపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కమిషనర్ యు. శారదాదేవి హాజరయ్యారు. అనంతరం రోటరీ క్లబ్, కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి వారిని సన్మానించి ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ హేమామాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి రాజు, డెప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు మున్నంగి వివేకానందరెడ్డి, కిరణ్‌కుమార్, కేశవరావు, రాజేష్, సుకుమార్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

రాజీవ్ సెంటర్‌లో...

నగరంలోని రాజీవ్‌సెంటర్ రామనాథం రామకోటయ్య, శివపార్వతమ్మల వృద్ధాశ్రమం వద్ద గాంధి విగ్రహానికి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు రామనాథం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నవులూరులో...

నగర పరిధిలోని నవులూరు శివాలయం సెంటర్‌లో గాంధి జయంతి సందర్భంగా గాంధి విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి పిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డక కృష్ణ, రుద్రు నాగరాజు, తోట సాంబ,శివాలయం చైర్మన్ గంగయ్య పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

నగరంలోని గాలిగోపురం ఎదుట కల గాంధి విగ్రహానికి గాంధి జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి దేశానికి గాంధి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆకురాతి నాగేంద్రం, పంచుమర్తి ప్రసాద్, తులిమిల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌లో...

నగర పరిధిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ ఆవరణలో గాంధి జయంతి సందర్భంగా గాంధి చిత్రపటంతో పాటు లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు బెటాలియన్ కమాండెంట్ కేఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయిప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్లు దేవానంద్, హనుమంతు పాల్గొన్నారు.



ఏపీఎస్పీ బెటాలియన్ లో గాంధి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్ కేఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి

షైన్ ఆశ్రమంలో ...

నగర పరిధిలోని చినకాకాని షైన్ ఆశ్రమంలో తాడిబోయిన గంగాధర్ వర్ధంతి, గాంధి జయంతి సందర్భంగా అన్నదానం చేశారు. తొలుత గాంధి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం అనాథ బాలలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తోట శ్రీనివాసరావు, దొడ్డక కృష్ణ, దానబోయిన నాగయ్య, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, తాడిబోయిన సురేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో...

నగరంలోని పోస్టాఫీసులో గాంధి జయంతి నిర్వహించారు. గాంధి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఆవరణను శుభ్రపరచి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధికారులు జయకృష్ణ, మధుబాబు, రాఘవయ్య, వెంకటకుమార్, షేక్ సుభాని, రాంబాబు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..

ఫిరంగిపురం: సమసమాజ నిర్మాణం కోసం జాతిపిత మహాత్మాగాంధీ ఎంతో కృషిచేశారని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని కొండమెట్లబజారులోని మహాత్మాగాంధి విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, మేడా బాబు, చిట్టా అంజిరెడ్డి, జి.చంద్రం, పాలపాటి రఘు, డి. నరేంద్రకుమార్, పి.లక్ష్మయ్య, ఆర్.రంజన్‌బాబు, పి.చిన్నా, యల్లారెడ్డి, శౌరీ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో..

ఫిరంగిపురం, వేములూరిపాడు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో గాంధీజయంతిని పురస్కరించుకొని సోమవారం గ్రామసభలు నిర్వహించారు. సర్పంచి మేడాబాబు మాట్లాడుతూ జాతిపిత దేశస్వాతంత్ర్యం కోసం ఎనలేనికృషిచేశారన్నారు. అనంతరం గాంధి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యల్లారెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, వి.రాము, శౌరీ పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గాంధీ మహాత్ముడి మార్గం అనుసరణీయం

తాడికొండ: గాంధీజీ మార్గం అనుసరణీయమని తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి సిబ్బందితో కలసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకెళితే తప్పక విజయాలు సాధించవచ్చన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ అత్తోట దీప్తి గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



గాంధి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, కమిషనర్ శారదాదేవి తదితరులు



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



షైన్ ఆశ్రమంలో అనాథ బాలలకు అన్నదానం చేస్తున్న దృశ్యం



తాడికొండలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో అత్తోట దీప్తి

గాంధీ అడుగుజాడల్లో నడుద్దాం...

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి



నివాళులర్పిస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి

తాడేపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ జాతిపిత మహాత్మాగాంధీ అడుగు జాడల్లో నడవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలో మహాత్మాగాంధీజీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత సచివాలయం సమీపంలో ఉన్న జాతిపిత మహాత్మగాంధీ, వి.ఎం.రంగా విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గాంధీ చూపిన అహింస, శాంతి మార్గాలను అనుసరిస్తే దేశంలో అద్భుతమైన అభివృద్ధి సాధించవచ్చని, హింస పెరిగిపోతున్న నేటి సమాజంలో గాంధీజీ అహింస సిద్ధాంతాన్ని పాటించాల్సి ఉందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా సభ్యులు కుంచనపల్లి మాజీ సర్పంచి అమరా నాగయ్య, వైఎస్సార్ సీపీ తాడేపల్లి మాజీ రూరల్ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మిరియాల రాంబాబు, మాజీ సర్పంచి బిరుదుగడ్డ విజయేంద్రరావు, నాయకులు గడ్డం తాతయ్య, సొసైటీ మాజీ డైరెక్టర్ తమ్మిశెట్టి శివనాగేశ్వరరావు, నల్లపు డేవిడ్, చాగంటి వెంకటరెడ్డి, దొంతిరెడ్డి తిరుమల రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి తదితరులు

తాడేపల్లిరూరల్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్స్, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్పొరేషన్ కమిషనర్ శారదాదేవి మాట్లాడుతూ గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఊరు శుభ్రంగా ఉంటుందని, తద్వారా ప్రజలు ఆరోగ్యకర జీవనం సాగించేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హేమమాలిని, డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, ఏసీ శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి వైస్ ప్రెసిడెంట్ శెట్టి కేశవరావు, రామకృష్ణ, గోపు నాగ రాజేష్, మున్నంగి వివేకానందరెడ్డి, రమేష్, సుకుమార్ రెడ్డి, పలగాని శ్రీకాంత్, నాగ కిరణ్ పాల్గొన్నారు.

హర్డిల్స్‌లో స్వర్ణ జ్యోతి



మంగళగిరి: ఇటీవల బ్యాంకాక్‌లో నిర్వహించిన ఆసియా అథ్లెటిక్ చాంపియన్ షిప్–2023లో తెలుగు అమ్మాయి జ్యోతి యర్రాజీ 13.09 సెకన్ల టైమింగ్‌తో రేసును పూర్తి స్వర్ణం కై వసం చేసుకున్న సంగతి విదితమే. ఈ పోటీలలో హర్డిల్స్‌లో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళా అథ్లెటిక్‌గా జ్యోతి చరిత్ర సృష్టించింది. అలాగే మహిళల 200 మీటర్ల పరుగు పందెంలో 23.13 సెకన్లలో కొత్త వ్యక్తిగత అత్యుత్తమ రికార్డుతో రజితం సాధించింది. జ్యోతికి మంగళగిరితో అనుబంధం ఉంది. మంగళగిరిలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో బీఏ (2019–2022) చదివిన జ్యోతి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోంది. కళాశాల కరస్పాండెంట్ గోలి రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ ఆతుకూరి వెంకటేశ్వర యోగి, అధ్యాపకులు పి.రాజామెరిసిన్ బాబు హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి



మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి

తాడేపల్లిరూరల్: పట్టణాలు, నగరాలు పరిశుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న దళిత గిరిజన బలహీన వర్గాలకు చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజినీరింగ్ కార్మికుల ఉద్యోగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను ఖూనీ చేస్తూ న్యాయం కోరిన గొంతులను నొక్కేస్తున్నాయని విమర్శించారు. దేశంలో మున్సిపల్ పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం కార్మికులందరూ దేశ ప్రజలకు సేవ చేస్తున్నారని, వారి సేవలను గుర్తించకుండా ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించకుండా ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వాలు దగా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ లక్షలాది మంది కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు అన్యాయం చేశారని అన్నారు. సమాన పనికి సమాన వేసతం ఇవ్వాలని, నెలకు రూ.18500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, రాష్ట్ర వర్క్‌షాప్ నాయకులు బి.సోమయ్య, నాయకులు బి.ముత్యాలరావు పాల్గొన్నారు.

బాల్యం నుంచే నైతిక విలువలపై అవగాహన



భార్గవ్ మణిచంద్ర, జ్ఞానదివ్యను సత్కరిస్తున్న మానవత సంస్థ నిర్వాహకులు

తెనాలి: బాల్యం నుంచే నైతికత, మానవీయ విలువలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాల నిర్వహణకు మానవత స్వచ్ఛంద సంస్థ నిర్ణయించింది. గాంధీ జయంతి రోజున స్థానిక ఏఎస్‌ఎన్ డిగ్రీ కాలేజి లైబ్రరీ హాలులో ఏర్పాటైన సమావేశానికి సంస్థ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు నైతిక ప్రవర్తన అంశాలపై అవగాహన కల్పించాలని నిర్ణయించామని చెప్పారు. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ మరో ప్రాధాన్యత అంశంగా తీసుకుంటున్నట్టు చెప్పారు. గత నెలలో మూడు ఉదాత్తమైన సేవా కార్యక్రమాల్ని నిర్వహించినట్టు చెప్పారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుల్ని వారి నివాస గృహాల్లో సత్కరించడం, శారద సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత జామ మొక్కల పంపిణీలో భాగస్వామ్యం, స్వచ్ఛత హి సేవలో భాగంగా మున్సిపాలిటీ చేపట్టిన ఐలమ్మ రజకచెరువు పార్కు పరిశుభ్రతలో పాలుపంచుకున్నట్టు పేర్కొన్నారు.

ఇద్దరు ప్రతిభావంతులకు సత్కారం

21 ఏళ్లకే సీఏ పూర్తిచేసి, చార్టర్డ్ ఎకౌంటెంట్‌గా బాధ్యతలు చేపట్టిన భట్టిప్రోలు మండలం ఐలవరానికి చెందిన జొన్నాదుల భార్గవ మణిచంద్రను సత్కరించారు. సీఏ మెయిన్స్‌ను తొలి ప్రయత్నంలోనే పూర్తిచేసి భార్గవ ప్రతిభను కొనియాడారు. ఇంటర్‌లోనే పవర్ లిఫ్టింగ్‌లో సాధన చేసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాల్ని సాధించిన కఠెవరానికి చెందిన జ్ఞానం నాగదివ్యను ఇదే వేదికపై సత్కరించారు. సంస్థ కో–చైర్మన్ డాక్టర్ డి.శారద మాట్లాడుతూ స్వచ్ఛంద సేవను ఎవరికివారు ఆత్మ సంతృప్తి కోసం ఒక బాధ్యతగా చేపట్టాలని అభిప్రాయపడ్డారు. చేసిన సేవ పూర్తి ఫలాన్ని ఇవ్వకపోవడం ఒక్కోసారి నిరాశను కలిగించినా బాధ్యతగా కొనసాగిస్తున్నట్టు చెప్పారు. కార్యదర్శి తన్నీరు శ్రీనివాసబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ నివారణకు చేయూతలో భాగంగా సంస్థ తరపున కొత్తగా 3 వేల వరకు చేతిసంచుల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈ నెలలో వీటిని అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు చెప్పారు. ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు కల్యాణి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ జి.నాగేశ్వరరావు, డి.వి. సోమయ్యశాస్త్రి మాట్లాడారు. కొత్త సభ్యులు పరిచయం చేసుకున్నారు. సభ్యులు మొవ్వా సత్యనారాయణ, శాంతి షూమార్ట్ సాంబశివరావు, పరిమి శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

కారాగారాలు పరివర్తన శాలలు

న్యాయమూర్తి జె. శ్రీసీత

తెనాలి రూరల్: కారాగారాలు పరివర్తన శాలలని, క్షణికావేశంతో తొందరపాటు తనంతో చేసిన తప్పుల్ని సరిదిద్దుకోవడానికి వాటిని ఉపయోగించుకోవాలని రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.శ్రీసీత పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి ఆదేశాల మేరకు స్థానిక సబ్ జైలులో ఖైదీలకు న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. న్యాయమూర్తి శ్రీసీత మాట్లాడుతూ ఖైదీలకు కొన్ని హక్కులు, విధులు ఉన్నాయని, వాటిని సక్రమంగా నిర్వర్తిస్తేనే వర్తిస్తాయని చెప్పారు. కోపతాపాలు, విద్వేషాల్ని జయిస్తే స్వేచ్ఛగా, స్వతంత్రంగా సమ సమాజంలో గౌరవంగా జీవనం సాగించవచ్చని పేర్కొన్నారు. కారాగారంలోకి వివిధ నేరాలపై ఖైదీలుగా వచ్చే వారు సత్ప్రవర్తనతో కూడిన జీవనం సాగించాలని, విడుదలై బయటకు వెళ్లే నాటికి మంచి మనిషిగా మారాలని సూచించారు. తోటి ఖైదీలతో సోదరభావంతో మెలగాలని, జాతి, కుల, మత విభేదాలు చూడకుండా వారితో మర్యాదగా ప్రవర్తించాలని చెప్పారు. ముందుగా సబ్ జైలు ఆవరణలో ఉన్న గాంధీ మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఖైదీలకు గాంధీ జయంతి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు, దుప్పట్లు, ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మందలపు వేణుగోపాలరావు, కంచర్ల చంద్రశేఖర్, న్యాయవాదులు అప్పాల కిశోర్, మహేష్, జైలు సూపరింటెండెంట్ కృష్ణారావు, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది సరళ, యర్రంశెట్టి అనీల్ కుమార్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు బండ్లు అందజేత

తాడేపల్లిరూరల్: గాంధి జయంతిని పురస్కరించుకుని చిరువ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సోమవారం బండ్లు అందజేశారు. పెనుమాకలో పార్టీ కన్వీనర్ మేకా దామేష్‌రెడ్డి పాల్గొని బండ్లు అందజేశారు. కార్యక్రమంలో పెనుమాక 1వ సచివాలయం కన్వీనర్ బషీర్, 2వ సచివాలయ కన్వీనర్ పులి భుజంగరావు, నాయకులు బొక్కా ప్రసన్నకుమార్(నాని), మేకా అంజిరెడ్డి, కళ్ళం శేఖర్‌రెడ్డి, భవనం రవీంద్రరెడ్డి, మీరా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి చేతుల మీదుగా చిరువ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థికసహాయంతో తయారు చేయించిన బండ్లను గాంధీజయంతి సందర్భంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, మాజీ కౌన్సిలర్ వేముల లక్ష్మీ రోజా, పార్టీ నాయకులు కొరగంటి ఉదయరాజు, 6వ సచివాలయ కన్వీనర్ సింహాద్రి, గోపి, గృహ సారథి బోయిలపల్లి రాజు, ఎనుబరీ నరేష్, మహేష్ పాల్గొన్నారు. మహానాడుకు చెందిన చిరువ్యాపారులకు తోపుడు బండి, టిఫిన్ బండ్లను తాడేపల్లి పట్టణ మహిళా కన్వీనర్ అప్పికట్ల సంపూర్ణ పార్వతి అందజేశారు. కార్యక్రమంలో సాని కొమ్ము శ్రీనివాస్ రెడ్డి, జరీనా, రాయదుర్గపు మణెమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడులో అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని దుగ్గిరాల సర్పంచి పలుకూరి మేరమ్మ సోమవారం అందజేశారు. మృతుడి అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు అందించారు.

టిఫిన్ బండి అందజేత

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కెఎల్ రావు కాలనీకి చెందిన నహక్ సంతోషికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సహాయంతో టిఫిన్ బండిని సచివాలయ కన్వీనర్ బాలసాని దేవసుందరం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు బత్తుల దాసు, గురజాల పద్మావతి, నాయకులు తమ్మా రామిరెడ్డి, చిలుకోటి శ్రీనివాస్, మధు, తమ్మా అంజిరెడ్డి, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

న్యూట్రిషన్ ఫుడ్ అందజేత

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట ఎంఎంఎస్‌పీయూలో గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం మారుతీ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధినేత లక్కమరాజు సునీత మాట్లాడుతూ హెచ్‌ఐవీతో ఇబ్బంది పడుతున్న వారిని చిన్నచూపు చూడరాదని అన్నారు. అనంతరం వారికి న్యూట్రిషన్ ఫుడ్ అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ సిహెచ్.సుబ్బారెడ్డి, సిహెచ్.కల్యాణి, ఏఎన్‌ఎం ప్రత్యూష పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా గాంధీ జయంతి రోజు మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పలు స్టేషన్ల పరిధిలో అరెస్టు చేశారు. నల్లచెరువు ప్రాంతానికి చెందిన చింతలపూడి సుబ్బారెడ్డి మద్యం విక్రయిస్తున్న సమయంలో లాలాపేట పోలీసులు అదుపులోకి తీసుకుని 38 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద మద్యం విక్రయిస్తున్న బండి శ్రీనును అదుపులోకి తీసుకుని 18 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.

గురుకుల ఉపాధ్యాయులపై సామాజిక బాధ్యత

గుంటూరు ఎడ్యుకేషన్: పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఏర్పాటైన గురుకుల విద్యా సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న గురువులు మరింత సామాజిక బాధ్యతతో పనిచేయాల్సిన అవసరముందని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. సోమవారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ సమావేశ మందిరంలో వీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థలతో పాటు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ విద్యాసంస్థల నుంచి ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల్ని సత్కరించారు. సభాధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ మారుతున్న విద్యా విధానానికి అనుకూలంగా పాఠ్యాంశాలతో పాటు కంప్యూటర్, ఆంగ్ల మాధ్యమం, నైపుణ్యాలు, కరెంట్ అఫైర్స్ తప్పనిసరి బోధనాంశాలుగా ఉండేలా చూడాలని సూచించారు. గురుకుల విద్యాలయాల్లో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఉన్నత రంగాలకు ఎదిగారని తెలిపారు. రామకృష్ణారావు, కాంతీలాల్ దండే, ఢిల్లీ రావు, ప్రస్తుత గుంటూరు జాయింట్ కలెక్టర్ రాజకుమారి వంటివారు ఉన్నతంగా రాణించడం గురుకుల విద్యాసంస్థలకు గర్వకారణంగా భావించాలని తెలియజేశారు.